


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

12 గురువారం నవంబర్ 2026 పేజీలు: 3

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

- ప్రభుత్వానికి తోడుగా ఉచిత వైద్య సేవలు అందించడం శుభ పరిణామం
- ఉచిత కంటి శస్త్రచికిత్సలు, కాకతీయ సేవా సమితిని ప్రశంసించిన మంత్రి ఉత్తమ్
- శంకర నేత్రాలయ సహకారంతో కంటి ఉచిత శస్త్రచికిత్స శిబిరం ప్రారంభం
- వైద్య పరికరాల కొనుగోలుకు నిధులు ఇస్తా ఎంపీ రఘువీరారెడ్డి



కోదాడ - నవంబర్ 11 (సత్యనిష్ఠ) పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో అభినంద నీయమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోదాడ బైపాస్ రోడ్డు లోని కాకతీయ సేవా సమితి కళ్యాణ మండపంలో శంకర నేత్రాలయ సహకారంతో రావెళ్ల సీతారామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని నల్గొండ ఎంపీ కుందూరు రఘు వీరారెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందారావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి తోడుగా నిలుస్తూ పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న కాకతీయ సేవా సమితి ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీ రఘు వీరారెడ్డి మాట్లాడుతూ ఉచిత సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమయ్యే ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు కొరకు తన ఎంపీ నిధుల నుంచి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. కాగా మొదటి రోజు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, కాకతీయ సేవా సమితి అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేమూరి సురేష్, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండు రంగారావు, రావిళ్ళ సీతారామయ్య, పోటు రంగారావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, మార్తి మాధవరావు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఎస్‌టీయూ-ప్రాణక్ హీలింగ్ యోగ సంస్థ

22 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజుల పంపిణీ



సత్య నిష్ఠ ఆర్ సి హుజూర్‌నగర్
ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత అని, ఉపాధ్యాయ సంఘాల కృషి వల్లే పాఠశాలలకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు బూట్లు, సాక్సులు వంటి సౌకర్యాలు అందుతున్నాయని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాయనిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ సంఘం, ప్రాణక్ హీలింగ్ యోగ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న 22 మంది విద్యార్థులకు రూ.5,500 పరీక్ష ఫీజును నగదు రూపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బలహీన వర్గాల విద్యార్థులకు దాతల సహకారంతో 8 పాఠశాలల్లోని 250 మంది విద్యార్థులకు మొత్తం రూ.60 వేల ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి కృషి చేస్తున్న ఎస్‌టీయూ నాయకులు పాలూరు అంజయ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్న వారంతా తమ పాఠశాలల అభివృద్ధికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, పద్మ, ఎస్‌టీయూ నాయకులు కె.వి. సత్యనారాయణ, కె. వీరరాఘవులు, పిట్టల నాగేశ్వరరావు, మీసాల నరసింహారావు, జానకిరెడ్డి, హరిలాల్, శశికళ, విజయనిర్మల, ప్రదీప్, ఉష తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగ సేవలు చిరస్మరణీయం

- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఘన నివాళులు
- హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ నేతల నివాళి



హుజూర్‌నగర్-నవంబర్ 11 (సత్య నిష్ఠ): ఆధునిక భారత విద్యావ్యవస్థకు బలమైన పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హుజూర్‌నగర్ స్థానిక గ్రంథాలయంలో టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రటరీ ఎండీ అజీజ్ పాషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గెల్లి రవి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ బచ్చు రామారావు, మాజీ సర్పంచ్ గొట్టే రామయ్య, విజిలెన్స్ కమిటీ సభ్యులు గల్లా వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్య హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని నమ్మి, స్వతంత్ర భారతదేశంలో విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. ఆయన స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 1947 నుంచి 1958 వరకు సేవలందించారని గుర్తుచేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి విద్యాసంస్థల అభివృద్ధికి, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ వంటి సంస్థల ఏర్పాటుకు ఆయన విశేషంగా కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, జాతీయవాదిగా దేశానికి సేవలందించడంతో పాటు భారత విభజనను తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం భారతరత్న పురస్కారం లభించిందని తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో కూడా మౌలానా అబుల్ కలాం ఆజాద్ రచనలు, విద్యా సంబంధిత ఆలోచనలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని అన్నారు. విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు ఎస్.కె. మన్సూర్ అలీ, గంజి శివ, మజీద్ భాయ్, బిక్కన్ సాబ్, ముషం సత్యనారాయణ, సైదులు నాయక్, కోలపూడి యోహాన్, కస్తాల దిల్, గొట్టిముక్కుల రాములు, ఎస్‌డీ ఆశ్రఫ్ అలీ, శ్రీనివాస్ రెడ్డి, మేళ్లచెరువు ముక్కంటి, నాగేందర్, చింతకాయల రాము, ఎస్. రఫీ, భార్గవ్, నవీన్, వినోద్, మధు, క్రాంతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మిప్రియకు జన్మదిన శుభాకాంక్షలు

- తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో మర్యాదపూర్వక భేటీమంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్ష



దేవరకొండ - 11 నవంబర్ (సత్యనిష్ఠ):దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ కుమార్తె రామావత్ లక్ష్మిప్రియ తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ లక్ష్మిప్రియకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమెకు మంచి భవిష్యత్తు ఉండాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. తన పుట్టినరోజున కేటీఆర్‌ను కలవడం, ఆయన ఆశీస్సులు అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని లక్ష్మిప్రియ తెలిపారు.

13వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్

- మేయర్ చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- చర్లపల్లిలో ఈ నెల 21, 22 తేదీల్లో పోటీలు



నల్గొండ - 11 నవంబర్ (సత్యనిష్ఠ): ఈ నెల 21, 22 తేదీల్లో చర్లపల్లిలోని సెయింట్ మేరీస్ స్కూల్ వేదికగా నిర్వహించనున్న 13వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీల వాల్ పోస్టర్‌ను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడలను ప్రోత్సహిస్తూ పోటీల విజయవంత నిర్వహణకు సహకరిస్తున్న మేయర్ దంపతులకు షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ సిస్టర్ బి. బాల, జిల్లా అధ్యక్షుడు ఎస్. రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎం. సోమశేఖర్, జిల్లా కార్యదర్శి ఎండీ అక్బర్, జ్యోతితో పాటు అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్రికుంట వద్ద నూతన బ్రిడ్జి నిర్మించాలి

- ప్రయాణికుల కష్టాలను వెంటనే తీర్చాలి
- సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య డిమాండ్



గరిడేపల్లి - 12 నవంబర్ (సత్యనిష్ఠ): గరిడేపల్లి సూర్యాపేట ప్రధాన రహదారిలోని మర్రికుంట వద్ద నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్‌పై ఉన్న ఇరుకు వంతెన స్థానంలో పెద్ద బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య డిమాండ్ చేశారు. సీపీఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో గురువారం బ్రిడ్జి వద్ద రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఒక వాహనం మాత్రమే వెళ్లే ఇరుకు వంతెన వల్ల ఎదురెదురు వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని, ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారని, కొందరు ప్రాణాలు కోల్పోయారని అప్పయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ త్రిపురం సుధాకర్ రెడ్డి, అంబటి గోవిందరెడ్డి, పంగా ఈదయ్య, యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, గోధుముల ఈశ్వరాచారి, వేశాల ఆంజనేయులు, కట్టా అశోక్, షేక్ పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మాలధారణ ప్రారంభ మహోత్సవం

- పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- అన్నప్రసాద వితరణకు స్టీల్ సామగ్రి బహుకరణ



దేవరకొండ - 11 నవంబర్ (సత్యనిష్ఠ): దేవరకొండ పట్టణంలో నిర్వహించిన అయ్యప్ప మాలధారణ మహోత్సవం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అదేవిధంగా ఆలయంలో అన్నప్రసాద వితరణకు అవసరమైన స్టీల్ టేబుల్స్, స్టీల్ బెంచీలు, అన్నప్రసాదం వడ్డించేందుకు స్టీల్ ట్రాలీలను రూ. 12,12,111 విలువతో బహుకరించిన కీర్తిశేషులు గార్లపాటి వాచస్పతి జ్ఞాపకార్థం వారి తల్లితండ్రులు గార్లపాటి ఎల్లయ్య, అరుణకుమారిలకు ఎమ్మెల్యే బాలు నాయక్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభినందించి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ ఛైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, అల్లంపల్లి నరసింహ, వడత్యా దేవేందర్ నాయక్, నక్క వెంకటేశ్వర్లు, శిరందాసు కృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చలి పంజా

- రోజుకు రోజు పడిపోయిన ఉష్ణోగ్రతలు.. పెరుగుతున్న చలి తీవ్రత

సత్య నిష్ఠ ఆర్ సి హుజుర్నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు చలి పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా బాశెట్టి హరి ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

- ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యం



సత్య నిష్ఠం ఆర్ సి హుజుర్నగర్: హుజూర్ నగర్ తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా బాశెట్టి హరి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సూర్యాపేట ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (డీఏఓ)గా విధులు నిర్వహిస్తున్న ఆయన, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు నూతన తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన రామావత్ రవీంద్ర కుమార్

- ఇబ్రహీంపట్నం ఉప్పరిగూడలో వివాహ వేడుక
- వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్ష



దేవరకొండ - 11 నవంబర్ (సత్యనిష్ఠ): ఇబ్రహీంపట్నం ఉప్పరిగూడలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రామకృష్ణ, పూల యాదయ్య, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో ఇంటాక్ చాప్టర్ ఘన ప్రారంభం

- పానగల్లులో హెరిటేజ్ మారథాన్
- వారసత్వ కట్టడాల పరిరక్షణపై పిలుపు

నల్గొండ – 12 నవంబర్ (సత్యనిష్ఠ): భారతీయ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ ఇంటాక్ నల్గొండ చాప్టర్ ప్రారంభోత్సవం బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర చాప్టర్ ఆధ్వర్యంలో చారిత్రక పానగల్లులోని జిల్లా పురావస్తు మ్యూజియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు పానగల్లులోని ప్రసిద్ధ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం నుండి పచ్చల సోమేశ్వరాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ మారథాన్‌ను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ పురావస్తు కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, మన జీవన పరిణామం, సంస్కృతి, సంప్రదాయాలను నేటి సమాజానికి తెలియజేసే నిర్జీవ సాక్షాలే ఈ అపురూప వారసత్వ కట్టడాలని తెలిపారు. వారసత్వ కట్టడాల పరిరక్షణకు పాటుపడుతున్న ఇంటాక్



హెరిటేజ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. మారథాన్ అనంతరం మ్యూజియంలో ఏర్పాటు చేసిన మ్యూజియం ప్రదర్శనను తెలంగాణ హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు కొత్తాడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏ గ్రామాన్ని పరిశీలించినా చారిత్రక ఆధారాలు కనిపిస్తాయని, చరిత్ర పరిరక్షణ కోసం పాటుపడుతున్న చరిత్రకారులకు అభినందనలు తెలిపారు. ఇంటాక్ ఆల్ ఇండియా చైర్మన్ అశోక్ సింగ్ ఠాగూర్ నల్గొండ ఇంటాక్ చాప్టర్‌ను ప్రారంభించి, నల్గొండ జిల్లాలోని చారిత్రక ప్రదేశాల పరిరక్షణకు ఈ చాప్టర్ ఉపయోగపడుతుం దని, సంస్థ బాధ్యతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డిప్యూటీ డైరెక్టర్ పగడపు నాగారాజు, ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ వేదకుమార్ మణికొండ, కొత్త తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు హరగోపాల్, తెలంగాణ రాష్ట్ర చాప్టర్ కన్వీనర్ సజ్జద్ షాహిద్, నల్గొండ చాప్టర్ కన్వీనర్ సముద్రాల ధనంజయ్య, కో కన్వీనర్ అదేపు రమేష్ సూర్యకుమార్, చరిత్రకారులు మురళి రాగి, చిక్కుల యాదగిరి, సిలివేరు లింగమూర్తి, ఇంటాక్ ప్రతినిధులు, చరిత్ర అభిమానులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలు, పేలుళ్లపై విచారణకు ఆదేశం

- ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం
- ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్

పోలవరం – 12 నవంబర్ (సత్యనిష్ఠ): గంగవరం మండలం, జగ్గంపాలెం పంచాయతీ పరిధిలోని ఓజుబంధ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ నల్లరాయి క్వారీలు, పేలుళ్లపై ఆదివాసి సంక్షేమ పరిషత్ పోరాటానికి జాతీయ స్థాయిలో స్పందన లభించిందని, జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. గ్రామసభ అనుమతి లేకుండా మైనింగ్ లీజులు కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని, పర్యావరణ అనుమతులు, భద్రతా ప్రమాణాలు లేకుండా జరుగుతున్న భారీ పేలుళ్ల వల్ల ఆదివాసుల ప్రాణాలకు, ఇళ్లకు ముప్పు వాటిల్లుతోందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా, న్యాయస్థానాల ద్వారా వాస్తవాలు వెలికితీస్తున్నామని, ఓజుబంధలో చట్టవిరుద్ధ క్వారీ లీజులను రద్దు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మానవసేవే మాధవసేవ

- పేద విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించిన ప్రవాస భారతీయుడు
- 50 మంది విద్యార్థులకు 47,000 రూపాయల సాయం

కోదాడ – 11 నవంబర్ (సత్యనిష్ఠ): పేదరికం వల్ల ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదని, చేతనైన మేరకు మానవ సేవ చేయడమే మాధవసేవ అని సూర్యాపేట జిల్లా డీఐఈఓ బి. సులోచన రాణి అన్నారు. కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కోదాడలో పరీక్ష ఫీజు చెల్లించలేని 50 మంది నిరుపేద విద్యార్థులకు ప్రవాస భారతీయుడు పానుగంటి రుషి రాజా 47,000 రూపాయల ఫీజులు చెల్లించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బి. సులోచన రాణి మాట్లాడుతూ, ఈ సాయం



విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కలిగించడమేనని, వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని, సంపదలో కొంత భాగం మరొకరి భవిష్యత్తు కోసం ఖర్చు చేయడం సమాజంలో మార్పుకు నాంది అవుతుందని అన్నారు. ఈ సాయానికి కృషి చేసిన ఫిజిక్స్ లెక్చరర్ పానుగంటి రాజేష్‌ను, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, నృత్య పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రారంభ ఉపన్యాసం తెలుగు ఉపన్యాసకులు వేముల వెంకటేశ్వర్లు చేయగా, అధ్యాపకులు ఆర్. పిచ్చిరెడ్డి, జి. యాదగిరి, వి. బల భీమరావు, ఆర్. రమేష్, పి. రాజేష్, బి. రమేష్ బాబు, జి. వెంకన్న, ఆర్. రవి కిరణ్, కె. సతీష్, జి. నాగరాజు, ఎస్. గోపికృష్ణ, ఎస్.కె. ముస్తఫా, జె. తిరుపతయ్య, ఎస్.కె. ఆరిఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్. చంద్రశేఖర్, టి. మమత, డి.ఎస్. రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభకు ప్రాధాన్యత

- ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరు

దేవరకొండ – 11 నవంబర్ (సత్యనిష్ఠ):గిరిజా నగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలె తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సాహం అందించేందుకు ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు క్రీడారంగ అభివృద్ధిపై చిత్తశుద్ధికి నిదర్శనమని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మేధాశక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. 15 గురుకులాల నుంచి 17 ఏళ్ల లోపు విభాగంలో ఒక్కో పాఠశాల నుంచి 35 మంది చొప్పున క్రీడాకారులు పాల్గొంటున్నారని, 14, 17, 19 ఏళ్ల లోపు విభాగాల్లో ఈ నెల 11 నుంచి 16 వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు అధ్యాపకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జాజుల లింగంగౌడ్

విద్యతోనే వ్యక్తి వికాసం, జ్ఞానం పెరుగుతాయిపేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలవాలి

హైదరాబాద్ – 11 నవంబర్ (సత్యనిష్ఠ): స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, విద్యావేత్తలకు శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ విద్యతోనే వ్యక్తి వికాసం, జ్ఞానం పెరుగుతాయని, విద్య అనేది ప్రతి మనిషి జీవితంలో వెలుగులు నింపే శక్తివంతమైన ఆయుధమని అన్నారు. సమాజంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలందరికీ విద్య సమానంగా అందినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరికి విద్య అందించడం ప్రభుత్వాల బాధ్యతని, పేద విద్యార్థుల చదువులకు ఉపకార వేతనాలు, ఫీజు తిరిగి చెల్లింపు, హాస్టల్ వసతి సౌకర్యాలు కల్పించి వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు.